

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం సురక్షితం

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్‌బాబు


సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న డాక్టర్ రమేష్ బాబు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సిలో జరుగుతున్న పెద్దల బిసిజి టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ స్టోర్, డెలివరీ రూమ్, ఆక్సిజన్, రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం చింతలవారిపల్లిలో నిర్వహిస్తున్న 104 సేవలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీవిద్య, జులేఖ, వైద్య సిబ్బంది కిరణ్ బాబు, సుధాకర్, భానుబి, సురేష్, కరుణ పాల్గొన్నారు.

తెలుగు భాష ప్రాచీనతను కాపాడుకోవాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

భాషా ప్రాచీనతను పరిరక్షించుకోవటంతో పాటు భాష మనుగడను కాపాడుకోవటం అత్యంత ఆవశ్యకమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గురువారం కడప జిల్లా ఎర్రగుంట్ల మండలంలోని కలమల్లలో తొలితెలుగు శిలాశాసనం వెలుగు చూసిన చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహిస్తున్న తెలుగుబాషా దినోత్సవ వేడుకలకు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్శన ద్వారా ఓ మహోన్నత ప్రాచీన భాషకు వారసునిగా గర్విస్తున్నానని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ గర్వపడాలని సూచించారు. చొరవ తీసుకుని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కలెక్టర్ సహా ప్రతి ఒక్కరినీ ఆయన మనసారా అభినందించారు. గిడుగు స్ఫూర్తితో యువతరం తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. తెలుగు భాష ఎంత ప్రాచీనమైనదో, మన సంస్కృతి కూడా అంతే ప్రాచీనమైందన్నారు. భారతదేశంలో నాలుగో అతిపెద్ద భాషగా మన్ననలు అందుకుంటున్న తెలుగు, ప్రపంచ వ్యాప్తంగా మరెన్నో దేశాల్లోనూ తన ప్రాభవాన్ని చాటుతున్న విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఉత్తమ లిపిగా, అజంతా భాషగా తెలుగు అందుకున్న గౌరవాలను ప్రస్తావించారు. తెలుగు లాంటి మహోన్నత భాష ప్రాచీనతకు శిలాశాసనాలు సాక్ష్యంగా నిలుస్తాయన్న వెంకయ్యనాయుడు, శాసనాలను రాళ్లు, రప్పలుగా గాక మన సంస్కృతికి సంబంధించిన గొప్పలుగా చూడాలని ఆకాంక్షించారు. శాసనాల ప్రాచీనత మీద వ్యక్తమౌతున్న సందేహాల విషయంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్న ఆయన, ఇలాంటి శాసనాల భాష మీద ఆసక్తి పెంపొందే విధంగా చొరవ పెరగాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. శాసనాల పరిరక్షణ విషయంలో తమిళనాడును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్న ఆయన, తెలుగు భాష పరిరక్షణ, శాసనాలను సంరక్షణ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ తెలుగులో అతి ప్రాచీనమైన సాహిత్యం సుమతి శతకం, బద్దెన


సభలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కావ్యాలు కడప జిల్లా నుండే ఉద్భవించాయన్న విషయం గర్వించదగ్గదన్నారు. దాదాపు 1500 సంవత్సరాల క్రితం నాటి చారిత్రక నేపత్యం ఉన్న తెలుగు తొలి శాసనం మన ప్రాంతంలో కొలువై ఉండడం మన అదృష్టంగా భవిస్తున్నామన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే చడిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషలో తొలి శిలాశాసనం వెలసిన ఈ కలమల్ల గ్రామం ఈ రోజు తెలుగు తేనెల దారలతో పునీతమైందన్నారు. తెలుగు భాషా ఉన్నతమైనదని, పవిత్రమైనదని నేతికన్నా సరళమైనదన్నారు.

తెలుగు కవులకు సన్మానం : తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా అతిధుల చేతుల మీదుగా జిల్లాలో ప్రసిద్ధ తెలుగు కవులు షేక్ హుస్సేన్, నరాల రామిరెడ్డి, డాక్టర్ పి.సంజీవమ్మ, సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి, తవ్వా ఓబుల్ రెడ్డి లను దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. సభ ప్రారంభానికి ముందు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం కలమల్ల శిలా శాసనాలు నెలకొల్పిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన తెలుగు భాష ప్రాచీన, పూర్వ వైభవాన్ని ప్రతిభింబించే ఛాయా చిత్రాల గ్యాలరీలను తిలకించి తెలుగు శిలా శాసనాల ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెసి అదితి సింగ్, జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిఇఒ అనురాధ, డిఎఫ్ఒ సందీప్‌రెడ్డి, టిడిపి నాయకులు భూపేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, బాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ ప్రక్రియ వేగవంతం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

గృహ నిర్మాణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని విసి హాలులో పేదలకు గృహ నిర్మాణ పథకంలో భాగంగా జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పనుల పురోగతిపై సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, డిఎల్‌డిఒలు, మండల స్పెషల్ అధికారులు, లే అవుట్ ఎస్‌ఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ ఇఇలు, డిఇలు, సంబందిత అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేజి కన్వర్షన్, హౌసింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించి ప్రగతిలో వెనకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే హౌసింగ్ పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరై, ఇంటి నిర్మాణాల ప్రక్రియలో వెనుకబడిన ప్రాంతాల్లో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం గృహ నిర్మాణాల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీకి లోబడి ఇసుకను సరఫరా చేస్తారని తెలిపారు. ఇసుక అవసరం ఉన్న లేఅవుట్లలో పనులు చేపడుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం వివిధ దశల్లో జరుగుతున్న నిర్మాణ పనులను సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మెటీరియల్, లేబర్ కాంపోనెంట్, బిల్లుల పెండింగ్, ఇసుక, ఇనుము, నీరు, రోడ్లు తదితర అంశాల్లో సమస్యలపై సంబంధిత మున్సిపాలిటీల కమిషనర్లు, మండలాల ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. రాజంపేట డివిజన్ బోడిగుంటపల్లిలో రెండు రోజుల్లో ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణాలకు 46 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమవుతుందని అంచనా ఇంటి నిర్మాణాలకు సంబంధించి ఇసుక, సిమెంటు, నిధుల సమస్య లేదని తెలిపారు. పేదలకు హౌసింగ్ పథకంలో మున్సిపాలిటీలు, మండల స్థాయిలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ నిర్మాణాలు జరుగుతున్న అన్ని లే అవుట్లపై ప్రత్యేక దృష్టి సారించి గృహ నిర్మాణ లక్ష్యంలో జిల్లాను ప్రథమ స్థానంలో కొనసాగించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియా దేవి, ఆర్‌డిఒ రంగస్వామి, హౌసింగ్ పీడీ శివయ్య, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, మండల స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎపిడిఒలు, హౌసింగ్ ఇఇలు, డిఇలు, ఎఇలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగులోకి..
ర్యాగింగే కారణమంటున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-మైదుకూరు/కలికిరి

మైదుకూరు మండలానికి చెందిన బిటెక్ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కళాశాలలో ర్యాగింగ్ చేయడం వల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ అతని బంధువులు పేర్కొంటున్నారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బంధువుల కథనం మేరకు.. మైదుకూరు మండలం జి.వి.సత్రానికి చెందిన నాగేంద్రకు ఇద్దరు కుమారులు. వారిలో రెండో కుమారుడు ప్రవీణ్(21) అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని కలికిరి జెఎన్‌టియు కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరంలో కొత్తగా చేరాడు. కొద్ది రోజులుగా ప్రవీణ్‌ను కళాశాలలోని కొందరు సీనియర్లు ర్యాగింగ్ చేశారు. అతను ఈనెల 25న ఇంటికి వచ్చేశాడు. కుటుంబ సభ్యులు తిరిగి కళాశాలకు వెళ్లాలని చెప్పడంతో ఏం చేయాలో తెలియక, ఈనెల 26న అతను ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం వెంటనే తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందారు. తమ బిడ్డ ఉన్నత చదువులు


మృతి చెందిన ప్రవీణ్ (ఫైల్ ఫొటో)

చదివి తమకు చేదోడు వాదోడుగా ఉంటాడని అనుకున్న కుమారుడు తమకు పుత్ర శోకాన్ని మిగిల్చాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి పిర్యాదు మేరకు మైదుకూరు పోలీసులు కలికిరి జెఎన్‌టియు కళాశాలకు చేరుకుని కలికిరి సిఐ రెడ్డి శేఖర్ రెడ్డి సాయంతో ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావును, తోటి విద్యార్థులను విచారించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రవీణ్ ఆగస్టు 12న డిటెక్ సెకండియర్‌లో జాయిన్ అయ్యాడని, అదే రోజు లగేజ్ కోసం ఇంటికి వెళ్లి 20న కళాశాలకు వచ్చి మూడు రోజులు క్లాసులకు హాజరయ్యాడని తెలిపారు. 23 సాయంత్రం హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా ఇంటికి వెళ్ళిపోయాడని, తర్వాత 26న మృతుని తండ్రి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పడంతో నివ్వెరిపోయామని చెప్పారు. గురువారం పోలీసులు వచ్చి విచారించారని, ర్యాగింగ్ నిజమని తేలితే బాధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఫ్రీహోల్డ్ భూములపై సబ్ కలెక్టర్ విచారణ


ఫ్రీహోల్డ్ భూములను రీ వెరిఫికేషన్ చేస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలో ఫ్రీహోల్డ్ అయిన భూములపై మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ గురువారం విచారణ చేపట్టారు. స్థానిక తహశీల్దార్ ఖాజాబీ, మండల సర్వేయర్, ఆర్ఐ, విఆర్‌ఒలతో కలిసి మండల పరిధిలోని వలసపల్లి, కోళ్లబైలు, చిప్పిలి, పప్పురెడ్డిగారిపల్లి పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఫ్రీహోల్డ్ అయిన భూములను పరిశీలించారు. వీటిపై సమగ్ర విచారణ చేసి ఏఏ స్థాయిల్లో ఈ భూములు ఉన్నాయో, ఎవరెవరి అభ్యర్థన మేరకు ఈ భూములను ఫ్రీహోల్డ్‌కు పెట్టారో, ఆ సమయంలో ఉన్న అధికారులు ఎవరూ తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపడుతున్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం ఘటన కేసులో ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారం కీలకంగా మారిన సంగతి తెలిసిందే. మదనపల్లె రెవెన్యూ డివిజన్లో 2.16 లక్షల ఎకరాలు భూములు ఫ్రీహోల్డ్ చేశారని, అందులో 4,400 ఎకరాలు భూములు రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని రాష్ట్ర రెవెన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంపై మదనపల్లె సబ్ కలెక్టర్ రీ వెరిఫికేషన్ చేపట్టడం కీలకంగా మారింది. ఈ విచారణ అన్ని మండలాల్లోనూ కొనసాగే అవకాశాలు కనబడుతున్నాయి.

అక్రమ కేసులపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక టిడిపి నాయకులను, కార్యకర్తలను వేధించేందుకు నమోదు చేసిన తప్పుడు కేసులపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరిపించి ఆ కేసులను తొలగించాలని కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్‌కుమార్‌ను ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం రాజంపేట పట్టణానికి విచ్చేసిన డిఐజిని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో టిడిపి నాయకులు కలిసి వారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా అనగదొక్కేందుకు తప్పుడు కేసులు పెట్టి టిడిపి నాయకులను, కార్యకర్తలను వేధించారని, ఈ కేసుల వలన ఆర్థికంగా, మానసికంగా టిడిపి క్యాడర్ చాలా ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. కేసులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తప్పుడు కేసులను తొలగించి వారికి ఉపశమనం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కుమార్, మాజీ రాష్ట్ర డైరెక్టర్లు గుల్జార్‌బాష, కొమర వెంకట నరసయ్య, పార్ల మెంట్ అధికార ప్రతినిధి ప్రతాప్ రాజు, టిఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు శివకుమార్, పట్టణ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నాయకులు జి.వి సుబ్బరాజు, తెలుగు యువత పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబూబకర్, కౌన్సిలర్ రాజేష్, సర్పంచ్ కోటయ్య నాయుడు, తెలుగు యూత్ పట్టణ ప్రధాన కార్యదర్శి సోహెల్, మైనారిటీ అధ్యక్షులు ఎస్కే కరీమ్, చమర్తి మహేష్ రాజు పాల్గొన్నారు.


డిజిపికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నేతలు

మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. గురువారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిసర పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు స్పోర్ట్స్, గేమ్స్‌లో ఆసక్తి కనపరిచి విద్యతోపాటు శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్లస్టర్ స్థాయి నుంచి జిల్లా, జాతీయస్థాయిల పోటీలకు ఎంపికైన వారికి విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని క్రీడా సంస్కృతిని నగరాలకే పరిమితం కాకుండా పల్లెలకూ చేరవేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అంశంపై ఆవశ్యకతను వివరించాలని చెప్పారు. ప్రతిభ కనపరిచిన క్రీడా కారులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి క్రీడా అధికారులు, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం, సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగ అధిపతులు , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మెమోంటోను అందజేస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : సీజనల్ వ్యాధులపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండలంలోని నగిరిమడుగు పిహెచ్‌సి డాక్టర్ కీర్తి అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ ఇళ్ల పరిసరాలు పరి శుభ్రంగా లేకపోతే దోమలు వృద్ధి చెందుతాయని, దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, జ్వరాల భారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, చెత్త దిబ్బలు ఊరికి దూరంగా వేసుకోవడం, శుక్రవారం డ్రైడే పాటించడం, నీటి నిల్వలు లేకుం డా చూసుకోవడం, కిటికీలకు మెష్‌ను ఏర్పాటు చేసుకోవడం, ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవడం వంటివి చేసుకోవాలని సూచించారు. అనంతరం క్షయవ్యాధిపై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కల్పన, వైద్య సిబ్బంది నాగిరెడ్డి, మహమ్మద్ రఫీ, మురళి, పావని, నౌషాద్, ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువెత్తు ప్రతిరూపం పద్మజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వెలుగు సంస్థ వ్యవస్థాపకులు పద్మజ 19వ వర్ధంతిని గురువారం అమ్మచెరువు మిట్టలోని వెలుగు పాఠశాలలో నిర్వహించారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగు నింపాలనీ వారిని సకలాంగులుగా సమాజంలో సమన్వయం చేయాలనే తపనతో వారి సంక్షేమానికి 1997లో వెలుగు సంస్థను స్థాపించారని వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి, సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, ట్రెజరర్ రఘునాథ్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్ ఎం.ఉదయ్ కుమార్‌రెడ్డి, ఇసి మెంబర్లు సుజాత కొనియాడారు. కార్యక్రమంలో వెలుగు సోషల్ వర్కర్ ఎం.గీత, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ప్రయాణికుల కోసం నేడు లక్కీడ్రా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లి-తంబళ్లపల్లె మార్గం నందు ప్రయాణికుల కొరకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను శుక్రవారం తీయబడునని వన్ డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆ మార్గంలో ప్రయాణం చేయువారు, తీసుకున్న టికెట్ వెనుక వారి పేరు, ఊరి పేరు, వారి యొక్క మొబైల్ నెంబరు రాసి బస్సులోని గిఫ్ట్ బాక్సులో వేశారన్నారు. 30వ తేదీ లక్కీ డ్రాలో వచ్చిన ముగ్గురికి ఫోను చేసి వివరాలను తెలిపి బహుమతులు అందజేస్తామన్నారు. ఆర్టీసీ ప్రయాణం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ లక్కీ డ్రాను నిర్వహిస్తున్నామన్నారు.

రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి

సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 31న పంపిణీ చేస్తామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు శనివారం పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. 31న పింఛన్లు అందకపోతే సెప్టెంబర్ 2న అందరికీ అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైందని తెలిపారు. సెప్టెంబర్ 2 తర్వాత పింఛన్లు అందజేయరని ప్రతి ఒక్కరూ 31న తప్పనిసరిగా గ్రామంలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఏదైనా కారణం చేత అందుబాటులో లేని వారికి సెప్టెంబర్ 2న పంపిణీ చేస్తామని తెలిపారు. పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలి : విసికె


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా టైఫాయిడ్, మలేరియా, అతిసార, డెంగీ, చికున్ గునియా, ఎన్ సెఫలైటిస్, బోదకాలు తదితర వాటర్ బోర్న్ వెక్టార్ (సూక్ష్మక్రిములు/పరాన్నజీవుల ద్వారా వ్యాప్తిచెందే) సీజనల్ వ్యాధులు, విషజ్వరాలతో బాధపడుతున్న ప్రజల ఆరోగ్య రక్షణకు వెంటనే రూ.5 వేల కోట్ల నిధులను విడుదల చేయాలని, రాష్ట్రంలో మెడికల్, హెల్త్ ఎమర్జెన్సీ వెంటనే ప్రకటించాలని విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విసికె పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి జిల్లాకు రూ.100 కోట్లు కేటాయిస్తూ వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు, ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాలకు, కిడ్నీ వ్యాధిగ్రస్తుల నిలయాలుగా మారిన శ్రీకాకుళం ఉద్దానం, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల ఎ.కొండూరు, తిరువూరు మెట్ట ప్రాంతాల ప్రజల ప్రాణరక్షణకు అదనంగా రూ.2 వేల కోట్లు కేటాయించాలన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింత మహిళల ఆరోగ్యం, వైద్య సౌకర్యాల కల్పనకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో మంచి తాగునీరు, పారిశుధ్యం కల్పన కోసం వెంటనే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి నిధులు విడుదల చేయాలన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని 'చండీపుర వైరస్', దేశంలో విస్తరిస్తున్న 'మంకీపాక్స్ వైరస్'లను రాష్ట్రంలో ప్రవేశించకుండా అడ్డుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, పారిశుధ్యం, మంచినీరు వంటి మౌలిక అవసరాల కోసం పురపాలక, పట్టణాభివృద్ధి, గ్రామీణాభి వృద్ధి శాఖల మంత్రులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అవసరమైతే అలసత్వం, అసమర్థత ప్రదర్శిస్తున్న మంత్రులను ఆయా శాఖల బాధ్యతల నుంచి తప్పించి సమర్థత కలిగినవారికి కేటాయించి అయిదున్నర కోట్ల రాష్ట్ర ప్రజల ప్రాణ, ఆరోగ్య రక్షణకు క ృషి చేయాలన్నారు. సమావేశంలో విసికె పార్టీ, బాస్ నాయకులు పెద్దపాలెం రవిశంకర్, బురుజు రెడ్డిప్రసాద్, తలారి కృష్ణ, జనార్ధన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


చంద్రబాబుతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నియోజకవర్గం అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా విజ్ఞప్తి చేశారు. గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లి అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం, రోడ్ల విస్తరణ, కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని సిఎంకు వెల్లడించామన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి త్వరలో మదనపల్లి నియోజకవర్గంలో పర్యటిస్తానని, పేదలకు 1000 కాలనీ ఇండ్లను మంజూరు చేయడంతో పాటు తగినన్ని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మదనపల్లి అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

ఎపిపిటిడి కార్మిక పరిషత్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ కార్మిక పరిషత్ ఆర్టీసీ మదనపల్లి-1 డిపో గౌరవ అధ్యక్షులుగా గుత్తికొండ త్యాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎపిపిటిడి కార్మిక పరిషత్ రీజినల్ కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లిలో ఎపిపిటిడి కార్మిక పరిషత్‌ను బలోపేతం చేస్తూ, ఆర్టీసీలో కార్మికులు, హక్కులను సాధించుకొనడానికి అందరు కలసి సమన్వయంతో పనిచేస్తు ముందుకు సాగుదామన్నారు. డిపో-1 డిపో అధ్యక్షులుగా ఆర్.జె.ఎస్.రెడ్డి, కార్యదర్శిగా కె.నాగరాజ, కమిటీ సభ్యులుగా కెపిఎన్ రెడ్డి, ఎస్.ఎస్.బాషా, ఎం.ఆర్ నాయక్, బి.చలపతి, జి.రాజన్న, జి.మధుకర్ ఎన్నికయ్యారు. డిపో మేనేజర్ వెంకట రమణా రెడ్డికి పుష్ప గుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలుసుకొన్నారు. కార్యక్రమంలో సామల చిన్న వెంకట సుబ్బయ్య, ఎం.ఆర్.నాయుడు, ఐఎన్ కుమార్, ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్

పంట నమోదు తప్పనిసరి : జెడి

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ప్రతి రైతు తమ తమ పొలాల్లో వేసిన పంటలను స్థానిక సచివాలయాలలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ రైతులకు సూచించారు.గురువారం మండలంలోని గంగాపురంలో వేసిన నారాయణ వేరుశనగ పంటను సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి రైతు తాము వేసిన పంటలను నమోదు చేస్తే ఒకవేళ రైతుకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం, పంటబీమా పొందవచ్చని తెలిపారు. గ్రామంలో వేరుశనగ పంట వేసిన మాధవ అనే రైతు పొలాన్ని పరిశీలించి, వేరుశనగ పంట ఉన్న తీరును చూసి సంతృప్తిని వ్యక్తం చేసి, పంటలో అధిక దిగుబడులు రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ లావణ్య, ఎఇఒ శ్రావణ్ కుమార్, విహెచ్ఎ అనంత, రైతు మాధవ పాల్గొన్నారు.

నేడు పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట

నేడు ఓబులవారిపల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ విజయ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఎంపిపితో పాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారని, మండ లానికి సంబంధించిన అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తెలిపారు. మండలానికి సంబంధించిన వాళ్ల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో సభకు హాజరుకావాలని సూచించారు.

ఎస్సి వర్గీకరణ వద్దు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని 14 గ్రామ పంచాయతీల దళిత గ్రామాల ప్రజలు ఎస్సి వర్గీకరణ వద్దు అంటూ నినాదాలు సుండుపల్లిలోని మూడు రోడ్ల సమీ పంలో ర్యాలీగా నిర్వహించి, అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఎస్సి వర్గీకరణకు మద్దతు పలకడం శోచనీయమని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు బండి ఈశ్వర్, మండల ప్రజా సంఘాల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణయ్య పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో సిఐ తనిఖీ

ప్రజాశక్తి-కలకడ


రికార్డులు పరిశీలిస్తున్న సిఐ గురునాథ

మండల కేంద్ర మైన కలగడ పోలీసుస్టేషన్‌ను కలకడ సిఐ గురునాథ గురు వారం తనిఖీలు నిర్వహించిన తెలిపారు. పోలీసుస్టేషన్‌లో రికార్డులు, రిజిష్టర్‌ను పరిశీలిం చారు. అనంతరం సిఐ మాట్లాడుతూ సిబ్బంది పాటించి విధులకు హాజరు కావాలని అన్నారు. ఉదయం, సాయంత్రం రోల్ కోల్‌కు తప్పక హాజరు కావాలని, నైట్ బీట్ సక్రమంగా నిర్వహించాలని, సెంట్రీ డ్యూటీలో ఉన్న సిబ్బంది సమయానికి తగ్గట్టుగా విధులు నిర్వహించాలని సూచించారు.రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి చోరీలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఆరుబయట మద్యం సేవిం చినతో వాటిని అవసర రుసుంతో పాటు, కేసు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, పోలీసు సిబ్బందిపాల్గొన్నారు.

పుల్లంపేటలో పలు రైళ్లకు స్టాపింగ్

ప్రజాశక్తి-పుల్లంపేట

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి కృషి వల్ల నందలూరు స్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్, ఓబులవారిపల్లి స్టేషన్‌లో హరిప్రియ, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపేందుకు రైల్వే శాఖ అనుమతి ఇచ్చినట్లు గుంతకల్ మాజీ బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి తెలిపారు. పలు రైళ్ల స్టాపింగ్ పట్ల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారని పేర్కొన్నారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో అభివృద్ధిని ప్రధాన అంశంగా చొరవ తీసుకొని ఎంపీ ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

భూ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ రికార్డుల కాల్చివేసిన సంఘటనపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నేతృత్వంలో రెవెన్యూ మంత్రిని సిపిఐ నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మదనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో పేదల భూములు, ప్రభుత్వ భూములు, 22 - ఏ లో జరిగిన అరాచ కాలపైన సమగ్ర విచారణ జరిపించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని కలిశామన్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సంఘటనపైన ఇంతవరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదని, పేదల భూములు బలవంతంగా లాక్కున్నారని, ప్రభుత్వ భూములు చుక్కల భూములు, ధర్మాదాయ, దేవాదాయ,చెరువు, వాగు వంక పోరంబోకులు ఇనాం భూములను ఫ్రీ హోల్డ్ చేయించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కొంతమంది నాయకులు రెవెన్యూ అధికారులతో కలిసి డికెటి భూములు ఉన్నని పేదలను బెదిరించడం, వాళ్ల భూ రికార్డులు ఆన్‌లైన్‌లో డిజిటల్ సంతకాలను పెండింగ్‌లో పెట్టి ఈ భూములు మీవి కావని బెదిరిస్తున్నారని అన్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో 22- ఎ ఫైల్స్‌లో జరిగిన అవకతవకల వల్ల రెవిన్యూ అధికారులు, భూకబ్జాదారులు, రాజకీయ అండదండలతో ప్రభుత్వ రికార్డులు తగలబెట్టారని అన్నారు. మంది ఒక్కరోజులోనే వారి సమస్యలను అర్జీదారులకు అందించారని పేర్కొన్నారు. పేదల నుంచి లాక్కున్న భూములను ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్, కన్వర్షన్ చేసిన వాటిని రద్దు చేయాలని మంత్రిని కోరామని తెలిపారు.

సర్పంచ్ సేవలు మరువలేనివి : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్నె మడుగు సర్పంచ్ శ్యామలమ్మ పంచాయతీ అభివృద్ధితో పాటు వైసిపి బలోపేతానికి చేసిన కృషి మరువలేనిదని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం అనారోగ్యంతో మృతి చెందిన కన్నమడుగు సర్పంచ్ శ్యామలమ్మ అంత్యక్రియల్లో వారు పాల్గొన్నారు. సర్పంచ్ శ్యామలమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు రామకృష్ణారెడ్డి, పెద్దబాబు, రవి శంకర్ రెడ్డి చిన్నబాబు, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. సర్పంచ్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుగొన్న మద్దిరెడ్డి, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైసిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అపరిశుభ్రతకు నిలయం..బాలుర వసతి గృహం

- మరమ్మతులకు నోచని మరుగుదొడ్లు
- నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలం కేంద్రం సుండుపల్లె గ్రామపంచాయతీలోని అప్పన్న కుంటలో ఉన్న ఎస్‌సి బాలుర వసతి గృహం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ భవనం చుట్టూ చెత్తా చెదారం పేరుకపోవడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని పిల్లలను హాస్టల్లో ఉంచాలంటే భయమేస్తోందని అన్నారు. స్నానం చేసేందుకు, నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. చాలా రోజులుగా మరుగుదొడ్లు వినియోగం లేవని వాటికి మరమ్మ తులు కూడా చేయించలేదని చెప్పారు. మరుగు దొడ్లకు తలుపు ఊడి పోయి, చెత్తా చెదారంతో నిండి దుర్భంగా మారాయని అన్నారు. ఆరుబయటే విద్యార్థులు స్నానాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత కల్పి స్తామన్న ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఇక్కడి వసతి గృహం కనిపిం చలేదా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పిల్లలను వసతి గృహం ఉంచి చదివించాలంటే భయంగా ఉందని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు హాస్టల్లో తనిఖీ చేసి మౌలిక వసతులు ఏ మేరకు ఉన్నాయో గమనించాలన్నారు. విద్యా ర్థులకు సౌకర్యంగా పరిసరాలను శు భ్రంగా చేయించి, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి నీటి వసతిని కల్పించాలని కోరారు.


మరుగుదొడ్లకు ఊడిన తలుపులు


అపరిశుభ్రంగా ఉన్న హాస్టల్ పరిసరాలు

ఉన్నతాధికారులు తనిఖీ చేయాలి



అప్పన్నకుంటలో ఉన్న ఎస్‌సి వసతి గృహం అపరిశుభ్రతకు నిలయంగా ఉంది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుడొడ్లకు తలుపులు ఊడిపోయి శిథిలా వస్థకు చేరాయి. హాస్టల్ పరిసరాలు చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉంది. విద్యారంగానికి ప్రాధాన్యం కల్పిస్తామంటున్న ప్రభుత్వ పెద్దలు ఇక్కడి పరిస్థితిని గమనించాలి. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనిఖీ చేయాలి. విద్యార్థులకు మరుగుదొడ్లు, నీటివసతి కల్పించి పరిసరాలను పరిశుభ్రం చేయించాలి.

-మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కె.వి రమణయ్య

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


గాలివీడు : గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పద్య పఠన పోటీలు తెలుగు సంస్కృతి సాంప్రదాయాల వక్తృత్వ పోటీలు , క్రీడా పోటీలు నిర్వహించారు.గిడుగు వెంకట రామమూర్తి తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు, గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, విలువనూ తెలియజెప్పిన మహనీయుడని ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు మోడం చంగల్ రాయుడులు పేర్కొన్నారు. ధ్యాన్ చంద్ ఒక సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు పాల్గొన్నారు.అన్నిభాషల్లో కెల్లా తెలుగు భాష మధురమైనదని ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపల్ విజయభారతి పేర్కొన్నారు. కార్యక్రమములో వైస్ ప్రిన్సిపాల్ ఎం రమణయ్య ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పుష్పకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో తెలుగుభాష దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీ ఖాన్, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. క్రీడలలో దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించడం ఆనాటి నుంచి ఆనవాయితీగా వస్తున్నాదన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు వెంకట గోపాల్, వాణి, తనుజ, రేణుక, భద్రయ్య ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.**పుల్లంపేట :** మండల పరిధిలోని కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సివి.రమణమూర్తి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్య క్రమంలో యనమల సుబ్బయ్య సతీమణి నిలమ్మ విద్యార్థులకు భగవద్గీతను అందించారు. **వాల్మీకిపురం:** గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వ్యావహారిక భాషగా రూపొందించడానికి గిడుగు రామమూర్తి అందించిన సేవలు చిరస్మరణీయమని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సావిత్రి అన్నారు. మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులు తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధ్యాన్ చంద్ చిత్రపటాలకుపూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజ, తారాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు. **రామాపురం :** మాతృభాష తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలదేవి తెలుగు ఉపాధ్యాయులు రాఘవేందర్ రెడ్డి, శివలీల, చంద్రసేన, పుష్పలత పేర్కొన్నారు. పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.**గాలివీడు:** మండలంలోని నూలివీడు ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివా సులు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ జనార్ధన, చంద్రశేఖర్, వినాయకరావు, నాగేశ్వర్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.**బి.కొత్తకోట :** మండలం మండలంలోని ఎపి ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శీనునాయక్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం, క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ జి.వెంకటరమణ, టిడిపి నాయకులు నాయకులు కుడుం శ్రీనివాసులు, నారాయణస్వామి రెడ్డి,రాజు, తెలుగుభాష ఉపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, శివశంకర్ రెడ్డి,ప్రత్యూష వ్యాయామ ఉపాధ్యాయుడు సుదీర్ కుమార్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పట్టణ కేంద్రంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్నటువంటి శ్రీ చైతన్య పాఠశాలలో మాతృభాష దినోత్సవ వేడుకలను ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుభాషా సమితి నగర అధ్యక్షులు బి.రామ చంద్రనాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, ప్రైమరీ ఇన్‌ఛార్జి సంధ్య, తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్ :** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ భాష మరువరానిదని, అమ్మ భాషలో అర్థమైన విధంగా పరభాషలో అర్థం కాదని కాబట్టి మాతృభాష తెలుగులో చదువుకుంటే ఏ ఇతర భాషలనైనా సులభంగా నేర్చు కొనవ చ్చున్నా రు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు శివ పార్వతి దేవి, రమణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.**పీలేరు :** 'సాహిత్య ప్రయోజనం సమాజం కోసమే' అని ప్రముఖ కవి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ పాలకమండలి సభ్యులు డాక్టర్ వేంపల్లి అబ్దుల్ ఖాదర్ తెలిపారు. గురువారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో తెలుగు భాషా సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నటరాజ అధ్యక్షతన విద్యా ర్థులచే తెలుగుభాష ఔనత్యాన్ని చాటుతూ నినాదాలతో ఊరేగింపు కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు భాషా సమితి వ్యవస్థా పకులు జలకనూరి మురళీధర్ రాజు, సరస్వతి శ్రీరాములరాజు, మండల విద్యా శాఖ అధికారులు వై.లోకేశ్వర్ రెడ్డి, బి.పద్మావతి, పాఠశాలల తెలుగు ఉపాధ్యా యులు బొజ్జా రాజన్న, శచీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.**తంబళ్లపల్లి:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, తెలుగుభాష కోవిదులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ వాణిశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.**చిన్నమండెం :** మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుభాష అధ్యాపకులు సుబ్బ రాయుడు, గోపాల్, మాట్లాడుతూ తెలుగు భాష వ్యవహారిక భాషగా దక్షిణ భారతదేశ భాషలందు సమున్నత భాషగా తీర్చిదిద్దడంలో గిడుగు రామ్మూర్తి పంతులు సేవ అనిర్వచనీయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఎన్ఎస్ఎస్ పిఒ నాగ నవీన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



రామాపురం: తెలుగుభాషా పండితుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతులకు సూచనలు ఇస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-రామాపురం

వర్షాధార పండగ సాగు చేసిన వేరుశనగ పంటను బెట్ట నుంచి కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వీరయ్య, అంకయ్యలు రైతులకు సూచనలు చేశారు. మం డలంలోని బండపల్లె పంచాయతీ వెంకట్‌రెడ్డిగారిపల్లె రైతు సేవ కేంద్రం పరిధిలోని మనోహర్ అనే రైతు వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సంద ర్భంగా వర్షధార పంటగా సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితుల్లో బెట్టకు పంట తట్టుకోవడాని యూరియా 20 గ్రాములు లీటరు నీటికి లేదా మల్టీకే ఐదు గ్రాములు ఒక లీటరు నీటికి లేదా19-19-19 ఐదు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల వేరుశనగ పంట బెట్టు నుంచి కోలుకొని ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. వారి వెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అశోక్ కుమార్, డాక్టర్ మాధవి , లక్కిరెడ్డిపల్లి ఎడిఎ జయరాణి, ఎఒ నాగరాణి, ఎంపిడిఒ మార్జాన్, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులచే 2కె రన్

ప్రజాశక్తి-చిట్వేలి

30వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ మూర్తి ఆదేశాల మేరకు స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ఎన్‌సిసి విద్యార్థులచే ఘనంగా 2కె రన్‌ను నిర్వహించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు పి. పురుషోత్తంరెడ్డి జెండా ఊపి 2కెరన్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజున జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని, ఒలంపిక్స్ హాకీలో మూడు గోల్డ్ మెడల్స్ అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ నేటి యువత చదువుతోపాటు క్రీడారంగంలో కూడా రాణించాలని అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక దారుఢ్యం ఎతో అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు రన్నింగ్, వ్యాయామం చేయాలని సూచించారు.ఆరోగ్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చని అన్నారు. యువత ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టి దేశ భవిష్యత్తుకు తోడ్పాడాలని ఆకాంక్షించారు.


2కె రన్‌లో ఎన్‌సిసి విద్యార్థులు

2కె రన్ జడ్‌పి హైస్కూల్ నుంచి కెకెవడ్డెపల్లి మూల రోడ్డు వరకు వెళ్లి, తిరిగి పాఠశాల వరకు కొనసాగిందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎబిఎన్ ప్రసాద్, దుర్గరాజు, పిఇటి షబ్బీర్, చిన్నబాబు, బాలాజీ నాయక్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.


బురదమయమైన రోడ్డును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

బలిజపల్లి రోడ్డును పరిశీలించిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లి నుంచి బలిజపల్లి వెళ్లే రహదారిను గురువారం జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన నాయ కులు మచ్చ లక్ష్మీనారాయణ, ఒంటేరు రాజా మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రోడ్ల దుస్థితిపై ఏ మాత్రం దృష్టి పెట్టలేదని అన్నారు. మండలంలో చాలా చోట్ల రహదారిలో లేక వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బలిజిపల్లి వెళ్లే రోడ్డు వర్షాకాలంలో తెగిపోయి చాలా కాలం అవు తున్నా ఏ ఒక్క నాయకుడు పట్టించు కోలేదని అన్నారు. బలిజపల్లి రోడ్డు దుస్థితిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అతి త్వరలో సిసి రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సంతోష్, సుదీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సేవ చంద్రబాబుకే సాధ్యం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ప్రజాసేవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం టిడిపి కేంద్ర కార్యాలయంలో చిన్న తరహా పరిశ్రమల శాఖా మాత్యులు కొండపల్లి శ్రీనివాస్‌లతో ప్రజా వినతుల కార్యక్రమాన్ని నిర్వహించి,అర్జీ దారుల నుంచి వినతిపత్రాలును అందుకున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర కార్యా లయంలో ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించి వారి అవసరతలను తీర్చడంలో సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అందరికీ మేలు జరిగే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి సమస్యలతో వచ్చిన వారికి కేంద్ర కార్యాలయంలో తక్షణమే సమస్యలకు పరిష్కారం కోసంఈ కార్యక్రమాన్ని అధిష్టానం ఏర్పాటు చేసిందని అన్నారు.

క్రైం కార్నర్

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి-కలకడ


సాంబశివ (ఫైల్ ఫొటో)

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని కోన పంచాయితీ గారిపల్లికి చెందిన భోజనపు సాంబశివ తన బొలెరో వాహనం ద్వారా బాడుగలు తోలుకుంటూ జీవనం కడిపేవాడని తన భార్య నాగరాణి ఫిర్యాదులు పేర్కొన్నట్లు తెలిపారు. 24న సాయంత్రం మదనపల్లి పట్టణానికి సమీపంలో ఉన్న మిట్స్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యా ర్థులతో కర్ణాటక రాష్ట్రంలో ఉన్న పలు ప్రాంతాలకు విహార యాత్రకు పోతున్నట్లు చెప్పి బయలు దేరినట్లు తెలిపారు 28వ తేదీ వరకు ఇంటికి రాకపోవడంతో తన భర్త ఆచూకీ తెలపాలని ఫిర్యాదుల పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. సాంబశివ భార్య నాగరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యక్తి మిస్సింగ్ పై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు. గుర ువారం ఉదయం రెడ్డివారిపల్లి పంచా యతీ ఎర్రాతివారిపల్లె సమీపంలోని బహుద నదిలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఎర్రాతివారిపల్లెకు చెందిన సోమశేఖర్‌కు చెందినదిగా గుర్తించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ గుండ్లబురుజుకు చెందిన ప్రేమ్ కుమార్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఇసుక తరలించడానికి అనుమతులు లేవన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడి ఇబ్బందులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడ్డ చేనేత కార్మికుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రమాదంలో గాయపడిన చేనేత కార్మికుడు గురువారం మృతి చెందాడు. కురబలకోట మండలం, వనమరెడ్డిగారిపల్లి పంచాయతీ, పెద్దపల్లి కు చెందిన చేనేత కార్మికుడు సి.రాఘవరెడ్డి (58) సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో మదనపల్లి మండలంలోని సిటిఎం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న పాతూరుకు ఈ నెల 22వ తేదీన వెళ్ళాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళు తుండగా రైల్వే గేటు వద్ద పోలీసు స్టిక్కర్ ఉన్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు మదనపల్లె జిల్లా సర్వజన బోధనా స్పత్రికి తరలించగా, వైద్యులు అక్కడి నుంచి తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సిఐ కళా వెంకట్రమణ తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గొంతు కోసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పుంగనూరు మండలం, వనమలదిన్నె పంచాయితీ, బసవి నాయునిపల్లెకు గట్టప్ప(78) ఒంటరిగా నివసిస్తున్నాడు. వయసు మీద పడడం, ఆరోగ్యం సహకరించక పోవడం, పలకరించేందుక్కువారు లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యాయ త్నానికి పాల్పడినట్లు తెలిపారు. పొరుగింటి వారు గుర్తించి బాధితుడిని 108 లో మదనపల్లి సర్వజన బోధనాస్పత్రికి తరలించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

- తహశీల్దార్ శ్రీధర్‌రావు హెచ్చరిక

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పట్టణం సమీపంలోని కానగులకుంట చెరువులో గురువారం అక్రమంగా మట్టిని తరలి స్తున్నారని రెవిన్యూ సిబ్బందికి సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. తహశీల్దార్ శ్రీధర్ రావు, ఆర్ఐ బాలాజీ, విఆర్ఒ అశోక్, కానగలకుంట చెరువు వద్దకు చేరుకొని అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహ నాలను సీజ్ చేసి, పోలీసు స్టేషనుకు తరలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదుచేస్తామన్నారు.



మట్టిని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుంటున్న తహశీల్దార్